

# అట్టహాసంగా సాగిన ఎక్స్ అఫిషియో ప్రమాణస్వీకారోత్సవం

**ఎమ్మెల్యే అమర్ కు ఘనస్వాగతం పలికిన కౌన్సిల్ సభ్యులు మరియు అధికారులు**
**సాఫీగా సాగిన కౌన్సిల్ సమావేశం**
**అధికారుల నిర్లక్ష్యంపై కౌన్సిల్ సభ్యుల అసహనం**
**సీజనల్ వ్యాధులు ప్రభలకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే**



**పలమనేరు జూలై 10,(పెన్ పవర్):**పలమనేరు పురపాలక సంఘ ఎక్స్ అఫీషియో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఈసందర్భంగా పలమనేరు శాసనసభ్యులు ఎన్.అమరనాథరెడ్డి కి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో పాటు మున్సిపల్ అధికారులు ఘనస్వాగతం తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఆయన అధికారికంగా అఫీషియల్ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేపట్టగా మున్సిపల్ చైర్ పర్సన్ చాముండేశ్వరి సుధాకర్,వైస్ చైర్మన్ రవితో పాటు పలువురు కౌన్సిలర్లు మరియు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహసిల్దార్ రంగనాయకులు తదితరులు ఆయనకు పుష్పగుచ్చాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎక్స్ అఫీషియో సభ్యులుగా అమర్నాథరెడ్డి మాట్లాడుతూ.....

పలమనేరు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళేందుకు నావంతుసహాయ,సహకారాలు అందిస్తానన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పలమనేరు అభివృద్ధికి కృషిచేద్దామని పిలుపునిచ్చారు.ఇక ప్రస్తుతం జిల్లాను వణికిస్తున్న డయేరియా మరియు డెంగీ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఇక ప్రధానంగా పలమనేరు పట్టణంలో గంజాయి అధికంగా లభిస్తుండడంతో ఆకతాయిల చేష్టలు అన్ని ప్రాంతాలలో ఎక్కువయ్యాయని దీన్ని వెంటనే అరికట్టాలని కౌన్సిలర్ కిరణ్ కుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందని దీనిపై దృష్టిసాధించాలని కౌన్సిలర్ కోదండరామయ్య కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.ఇక చెక్ డ్యాములు పూర్తిగా దెబ్బతిని నీటి సమస్యకు కారణం అవుతున్నదని కౌన్సిలర్ హైదర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పలువురు కౌన్సిలర్లు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రస్తావించారు. ఇలా ఉండగా కౌన్సిల్ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై ఒకరిద్దరు అధికారులు చెప్పిన సమాధానాలు అసంతృప్తిగా ఉండడంతో వారి తీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.ఏదేమైనా బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎటువంటి వాదవోపవాదాలు లేకుండా సవ్యంగా సాగింది.

పెన్ పవర్ రాయలసీమ
తిరుపతి । చిత్తూరు । అన్నమయ్య । వై.ఎస్.ఆర్ కడప । నంద్యాల । కర్నూలు । అనంతపురం

## హజ్ యాత్రికులకు ఘన స్వాగతం పలికిన మంత్రి ఫరూక్



**పెన్ పవర్, నంద్యాల, జులై 10**హజ్ యాత్రను ముగించుకొని ఆంధ్రప్రదేశ్ కు తిరిగి వచ్చిన హజ్ యాత్రికులను గన్నవరం ఎయిర్పోర్ట్ నందు వారికి ఘన స్వాగతం పలికారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ మాట్లాడుతూ హాజ్ యాత్రికులకు ఎటువంటి కష్టం, నష్టం రాకుండా ఎటువంటి ఆటంకాలు రాకుండా వారికి కావాల్సిన సౌకర్యాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ హర్షవర్ధన్, ఐఏఎస్ హజ్ కమిటీ సీఈవో అబ్దుల్ ఖాదర్, టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ఫతుల్లా , ముస్లిం మత పెద్దలు మౌలానా హుస్సేన్, ముఫ్తీ ఫారూఖ్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రఫీ తదితరులు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా త్రాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి



ఎంపీడీవో అబ్దుల్ రహీం

**పలమనేరు జూలై 10,(పెన్ పవర్):**ప్రతి గ్రామంలోని త్రాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలని పెద్దపంజాని మండల ఎంపీడీవో అబ్దుల్ రహీం సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం సర్పంచ్లకు పంచాయతీ కార్యదర్శులకు మరియు ఏఎన్ఎం లకు అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వాతావరణంలో మార్పుల కారణంగా ఏర్పడుతున్న సీజనల్ వ్యాధులు మరియు డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు అధికముగా వ్యాప్తి చెందకుండా అరికట్టాల్సిన బాధ్యత గ్రామాల్లో ముఖ్యంగా సర్పంచ్ కార్యదర్శులు పైనే ఉందన్నారు. ముఖ్యంగా కాలువలు శుభ్రపరచడం త్రాగునీటి పైపు లీకేజీ ఉంటే వాటిని వెంటనే మరమ్మత్తులు చేయాలని సూచించారు.అలాగే ఇంకుడు గుంతలు ఉంటే వాటిపై బ్లీచింగ్ విధిగా చల్లాలని గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒకరి పైన ఉందని అయన సూచించారు.

# పట్టణ సమస్యల పరిష్కారానికై ఎమ్మెల్యేను కోరిన పి.పి.ఎస్.సభ్యులు



**పలమనేరు జూలై 10,(పెన్ పవర్):**పట్టణం నందు ప్రజలకు అవసరమైన పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయవలసిందిగా పలమనేరు పరిరక్షణ సమితి స్థానిక శాసనసభ్యులు అమరనాథరెడ్డిని ఆయన కార్యాలయం నందు కలిసి సన్మానించి కోరడం జరిగింది.

పిపీఎస్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్ళై, కార్యదర్శి నరసింహులు గౌరవాధ్యక్షులు ఆనందబాబు ల ఆధ్వర్యంలో సమితి సభ్యులు,ఈ ప్రాంతంలో అత్యధికంగా ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కోసం బయట ప్రాంతాలకు అనేక వ్యయప్రయాసల కోర్చి వెళుతున్న దృష్ట్యా ప్రభుత్వాసుపత్రి నందు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా పట్టణంలో రోడ్లను, పలు కూడళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగజేస్తున్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను కూడా తొలగించి ప్రజారవాణాకు సౌకర్యం కల్పించాలని కోరారు.జవిలివీధి నందు గతంలో మంజూరైనటువంటి నూతనకాల్వ రామకృష్ణారెడ్డి కళాక్షేత్రం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, పెద్దచెరువు మరమ్మతులు చేపట్టి పలమనేరు పట్టణ అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు.ఎంతో ఘనచరిత్ర కల్గిన పలమనేరు ఆర్టిసి డిపో నిర్వీర్యమై పలుసర్వీసులు రద్దుచేసినందు వల్ల ప్రజలు తీవ్రఅసౌకర్యానికి గురవుతున్నందున గతంలో రద్దయిన సర్వీసులన్నీ పునఃప్రారంభించి కొత్త బస్సులు కూడా డిపోకు కేటాయింపబడేట్లుగా చూడాలని కోరారు.

సమస్యలన్నింటిని సావధానంగా విన్న శాసనసభ్యులు సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యలను తప్పక పరిష్కారానికి కృషి చేస్తానని పలమనేరు పరిరక్షణ సమితికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు విజయ్ కుమార్ పొన్నుడి, మురళి నారాయణ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆక్రమణలపై స్పందించిన మున్సిపల్ కమీషనర్

**పలమనేరు జూలై 10,(పెన్ పవర్):**పలమనేరు పురపాలక సంఘము నందు బుధవారం జరిగిన సాధారణ సమావేశము నందు పట్టణములోని ప్రధానరోడ్లు అనగా గంగమ్మగుడివీధి, బజారువీధి,జవిలివీధి, గుడియాత్తంరోడ్, వేణుగోపాలస్వామి గుడివీధి మొదలగు వాటిలో దుకాణాదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయుట మూలంగా నిత్యము వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు ఉన్నవిగా కౌన్సిల్ సభ్యులుప్రస్తావించారు.

దీనిపై వెంటనే స్పందించిన మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి మరియు టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తో బాటు సిబ్బంది కలిసి గంగమ్మ గుడివీధిలోని రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులు గురువారం నుండి సంత మైదానములోనికి మార్పు చేసుకోవాలని ఆదేశించారు.మరియు పట్టణములోని బజారు వీధి,జవిలివీధి,గుడియాత్తంరోడ్, వేణుగోపాలస్వామి గుడివీధి మొదలగు వాటిలో దుకాణాదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయువారందరూ స్వచ్ఛందముగా రోడ్డు ఆక్రమణ లేకుండా వారి వారి షాపు పరిధిలోనే వస్తువులను ఉంచుకొని వ్యాపారము చేసుకొనవలసినదిగా సూచించారు.ఎవరైనా రోడ్డును ఆక్రమించి వ్యాపారము చేయుచున్నచో సదరు ఆక్రమణలను తొలగించుటకు చర్యలు తీసుకొనబడునని ఆయన హెచ్చరించారు.


# చిన్నారి ని హత్యాచారం చేసి హత్య చేసిన నిందితుల ను కఠినంగా శిక్షించాలి-సిపిఐ




**పెన్ పవర్, నంద్యాల, జులై 10:** నంద్యాల జిల్లా నందికొట్కూరు తాలూకా పగడాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8 సంవత్సరాల చిన్నారి ని ఈనెల 7వ తేదీ అదే గ్రామానికి చెందిన నలుగురు మైనర్ బాలురు సినిమాలు, మత్తు పదార్థాల ప్రభావం వల్ల ఊరి చివర కాలవ వద్దకు తీసుకుపోయి అత్యాచారం చేసి ఆ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు చెపుతారని అనుమానంతో చిన్నారిని హత్య చేసి నీటి కాలువలో వేయడం దుర్మార్గమని ఇలాంటి దుర్మార్గుల ని మైనర్ బాలురని కాలం వెళ్లబుచ్చకుండా కఠినంగా చట్టపరమైన చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యువత మత్తు పదార్థాలకు బానిసలై ఈమధ్య వస్తున్న సినిమాలలో అసభ్యంగా మహిళలపై ఏలా దాడి అత్యాచారాలు చేయాలో తెలిపే రీతిలో సినిమాలు తీస్తున్న నిర్మాతలకు ఎలా కలెక్షన్ పెరిగి రావాలనే రీతిలో తీస్తున్నారని రాష్ట్ర సెన్సార్ అధికారులు కూడా అవినీతికి పాల్పడుతూ నిర్మాతలకు ప్రోత్సహించే రీతిలో ప్రవర్తించడం దుర్మార్గమని అన్నారు. వైఎస్సార్ జగన్ ప్రభుత్వం హయాంలో చిన్నారులు మహిళలు అదృశ్యం అయినారని ప్రభుత్వాధికారులకు తెలిసిన . మహిళలపై దాడులు. అత్యాచారాలు. నడిరోడ్డులోనే ప్రేమించలేదని అమ్మాయిలను కత్తులతో చంపినా గత ప్రభుత్వ హయాంలో పోలీసు అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మత్తు పదార్థాల వల్ల అలవాటు పడిన యువత మమ్మల్ని ఎవరు పట్టించుకోరని విచ్చల విడిగా మహిళలపై దాడులు, అత్యాచార్యులు చేస్తున్నారని అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఇలాంటి వారిపై కఠినంగా శిక్షించేందుకు చట్టపరమైన చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు.

## బ్రహ్మోత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ.





**పెన్ పవర్ - శ్రీ కాళహస్తి.జూలై 09.** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ ద్రౌపతి సమేత శ్రీ ధర్మరాజు స్వామి వారు వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుండి 24 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి బుధవారం ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధిలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి దేవస్థానం దగ్గర పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడ అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న నేపథ్యంలో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్ వి ఎస్ ఎన్ మూర్తి, మాజీ పాలసరఫరా సంఘం చైర్మన్ రావిళ్ల ముని రాజా నాయడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, కన్నలి ప్రతాప్ రెడ్డి, నాగామల్లి దుర్గ ప్రసాద్, నందం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పచ్చి రొట్టి విత్తనాలు పంపిణీ.



**పెన్ పవర్ - శ్రీ కాళహస్తి రూరల్, జూలై 10.**
శ్రీకాళహస్తి డివిజన్ వ్యవసాయ శాఖ తరపున శ్రీకాళహస్తి నియోజకవర్గం కు సంబంధించిన రైతు సోదరులకు పచ్చిరొట్ట విత్తనములను 50 శాతం రాయితీతో నియోజకవర్గ సంబంధించిన రైతుల సమక్షంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీని ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పరిపాలనలో రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు ముఖ్యంగా రైతులు కూడా ఒకే రకమైన పంట వేయకుండా పంట మార్పిడి చేస్తే లాభాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీ మీద విత్తనాలు,ఎరువులు,వ్యవసాయ పనిముట్లు రైతన్నలకు అందజేస్తామని అన్నారు త్వరలో అన్ని చెరువులకు కూడికలు తీయించి వ్యవసాయానికి సాగునీటి కొడత లేకుండా చేస్తామని అన్నారు. ఈ సమావేశమునకు శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని శ్రీకాళహస్తి తొట్టంబేడు ఏర్పేడు రేణిగుంట మండలాలకు సంబంధించిన రైతులు మరియు నాయకులు పాల్గొనడం జరిగినది, మరియు వ్యవసాయ శాఖ తరపున జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ ప్రసాద్ రావు, ఎ డి. ఎ శ్రీకాళహస్తి రమేష్ రెడ్డి, నియోజకవర్గంలోని నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, రైతు సేవ కేంద్రం యొక్క సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి.



**పెన్ పవర్ - ఏర్పేడు.జూలై 10:** తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి ఏర్పేడు మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాపా నాయుడు పేట పాఠశాలను ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. మూడవ తరగతి విద్యార్థులను ఒక్కొక్కరిగా పిలిచి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించడం జరిగింది. సి మరియు డి గ్రేడ్ అభ్యసన సామర్థ్యాలను పెంపొందించ వలసిందిగా ఉపాధ్యాయులకు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు ఆంగ్లం నందు అలవోకగా మాట్లాడడం చూసి విద్యార్థులను ఉపాధ్యాయులను డిఇఓ అభినందించడం జరిగింది. పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి %×ఖీ%, స్మార్ట్ టీవీ ఉపయోగించి బోధన బోధించే విధానాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం గురించి అమలు గురించి అడిగి తెలుసుకున్నారు పాఠశాల యందు విద్యార్థుల సంఖ్యను పెంచ వలసినదిగా ఉపాధ్యాయులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన రాజు ఉపాధ్యాయులు నిర్మలా మాధవి పాల్గొనడం జరిగింది.

## కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి,కనీస వేతనాలు అమలు చేయాలి- సి.ఐ.టి.యు




**బండి ఆత్మకూరు, పెన్ పవర్, జూలై. 10:** శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండల సిఐటియు డిమాండ్స్ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి కనీస వేతనాలు అమలు చేయాలి బండి ఆత్మకూరు మండల కేంద్రంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సి.ఐ.టి.యు దేశవ్యాప్త డిమాండ్స్ డే సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు నాయకులు రత్నమయ్య వెంకట రమణమ్మ, వసంత, సుశీలమ్మ , సువర్ణమ్మ , శిరోమణమ్మ, నాగరాజు , మహేష్ , రాజు లు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి యజమానులకు అనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, వివిధ పథకాలలో పనిచేసే కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం పిఎఫ్ , రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం 26,000 లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు రామచంద్రుడు, మండల కార్యదర్శి డేవిడ్ , స్వచ్ఛభారత్ కార్మిక సంఘం నాయకులు మహేష్ , ఖాదరయ్య మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు నాగలక్ష్మి వివో ఏల సంఘ నాయకులు సుబ్బరాయుడు, రమణమ్మ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులు నాగన్న జయన్న తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు సత్కారం





**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 10:** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను రాష్ట్ర ఐక్య కాపునాడు అధ్యక్షులు వాదా ప్రసాదరావు, వర్కింగ్ ప్రెసిడెంట్, గాదంశెట్టి కొండలరావు (మునసీబు) ఉపాధ్యక్షులు తుమ్మల శ్రీరామ్మూర్తి, తదితర సంఘ నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు కాపుల సమస్యలపై ఎమ్మెల్యే నెహ్రూకు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో కాపులకు ఎక్కడ న్యాయం జరగలేదని తెలుగుదేశం పార్టీ ద్వారానే మళ్లీ కాపులను న్యాయం చేయాలన్నారు. బీసీల్లో చేర్చే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి కాపులను న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుల అడపా ప్రకాష్ నాయుడు, గుండు వీర తాతారావు, గండి కిషోర్ , జగ్గంపేట కాపు జేఏసీ అధ్యక్షులు ధవులూరి ఈశ్వరరావు, తోలేటి సూర్యనారాయణ, లోకా రెడ్డి అప్పన్న దొర, మారిశెట్టి రాధా, పుర్రె సూరన్న, ఇళ్ల ముద్దాజీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జగ్గంపేట సంజీవి ఫిషర్ మెన్ సొసైటీ సంఘానికి చెందిన 40 మంది సభ్యులు, జగ్గంపేట గ్రామపంచాయతీ 17 వ వార్డు సభ్యులు కందరాడ చంద్రరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నెహ్రూ కు సాలువా కప్పి ఘనంగా సత్కరించారు. 50 సంవత్సరాల నుంచి సొసైటీ సంఘ సభ్యులుగా జీవనం సాగిస్తున్నామని ప్రభుత్వం ద్వారా చేపలు పట్టుకోవడానికి చేపలు అమ్ముకోవడానికి వలలు, ట్రైలు, మోటార్ సైకిల్, ఆర్థికంగా బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పించి చెరువులు బాగు చేసుకోవడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉంగరాల జీవరత్నం, కడితి ప్రసాద్, సలాది భూషణం, కలవల అప్పారావు, గుల్లా రాజబాబు, కడితిలాజర్, మర్ల యేసు, మర్ల ప్రకాష్, బూర చక్రం తదితర ఫిషర్ మాన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం




**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 10:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్దాపురం పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ స్టూడెంట్ ఫర్ డెవలప్ మెంట్ కోకన్వీనర్ కె. లలిత్ కుమార్ మాట్లాడుతూ 75 ఏళ్లుగా ఏబీవీపీ ఎన్నో విద్యారంగ సమస్యలపై పోరాటం చేసిందన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన ఏబీవీపీ దేశం నలుమూలలా విస్తరిస్తూ 50 లక్షల పైబడి సభ్యత్వంతో ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందని తెలిపారు. ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా అధిగమిస్తూ ఎన్నో విజయాలు సాధించిందన్నారు. భవిష్యత్తులోనూ ఏబీవీపీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తుందని ఆయన తెలిపారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక లెమ్స్ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

## పలమనేరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటనరసింహులు



**పలమనేరు జూలై 10,(పెన్ పవర్):** పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో నూతనంగా ఎస్సై వెంకటనరసింహులు బాధ్యతలను స్వీకరించారు. ఈమేరకు గతంలో ఇక్కడ ఉన్న ఎస్ఐ శివశంకర్ పుంగనూరు నియోజవర్గ పరిధిలోని సోమల కు బదిలీ అయ్యారు కాగా గతంలో సోమలలో ఎస్సైగా విధులు చేపడుతున్న వెంకట నరసింహులు అక్కడనుండి బదిలీపై పలమనేరు పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులను బుధవారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా తన విధులను నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రతి ఒక్క వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వ్యక్తులు వాహనాలను నడపాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం మంచిది కాదన్నారు.

## జగన్మోహిని కేశవ స్వామి కి విరాళం

**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 10:** ర్యాలి గ్రామంలో వెలిసిన పురాతనమైన దేవాలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం ఈ ఆలయానికి రాష్ట్ర నలదిక్కుల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి దేశాల నుండి తరలివస్తారు. ఈ స్వామి వారికి ఒక విశిష్ట కలిగి ఉంది ముందు కురిసిన రోబో వెనక స్త్రీ రూపం లో భక్తులకు దర్శనం ఇస్తారు. స్వామివారి రెండు పాదాల మధ్య నుండి నిత్యం గంగా ఉభవిస్తుంది.బుధ వారం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సన్నిధిలో జరిగే అన్నదాన పథకానికి విరాళాలు సమర్పించారు.తాళ్లరేవు మండలం జార్జి పేట గ్రామానికి చెందిన స్వర్ణ శ్రీనివాస భాస్కర్ జానకి దంపతులు 5,000 రూ,విరాళం సమర్పించారు వీరిని ఆలయ వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటాన్ని చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు.

## మానవ సేవకు బౌద్ధంలో అధిక ప్రాధాన్యత

శ్రీలంక బౌద్ధ భిక్షువు రెవ బోధిహీన

**అయినవిల్లి/అమలాపురం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 10:**
ప్రపంచ శాంతి, సర్వమానవ సంక్షేమాన్ని కాంక్షించే బౌద్ధంలోని అష్టాంగ మార్గాల్లో సేవ,సహాయాలు ఒకభాగమని శ్రీలంక బౌద్ధ సన్యాసి, తెలుగు శ్రీలంక జనతా ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ రెవ. బోధిహీన అన్నారు.కరోనా విపత్కర పరిస్థితుల్లో అయినవిల్లి మండలంలోని కె. జగన్నాధపురంలోని తన స్వంత ఇంటినే క్వారంటైన్ హౌస్ గా మార్చి, సుమారు 150 పైగా కరోనా మృత కళేబరాల అంత్యక్రియల్లో స్వయంగా పాల్గొని బాధిత కుటుంబాలకు అండగా నిలిచి చేయుతనందించడం చాలా సాహసోపేతమైనదని కరోనా వారియర్స్ గా ప్రజల మదిలో నిలిచారన్నారు గంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ శ్రీనివాస్ ల స్వగృహాన్ని ఆయన సందర్శించారు.ఆ సమయంలో జాతీయ మీడియా ద్వారా ఈ విషయాన్ని తెలుసుకుని తమ ఆరామంలోని భిక్షువులంతా చాలా సంతోషం చెందామని వివరించారు.మానవ సేవే మాధవ సేవ అని బోధించిన బౌద్ధ సిద్దాంతాన్ని ఆచరించిన ఈ గృహం ఒక దేవాలయంతో సమానమని ఆయన పేర్కొన్నారు.శాంతి,అహింస,సత్యాన్వేషణ దిశగా ప్రపంచాన్ని పయనింపచేయటంలో బౌద్ధం విశేషకృషి చేస్తోందని ఆయన తెలిపారు.గంగుమళ్ళ శ్రీనివాస్ దంపతులు ఏర్పాటు చేసిన భిక్షను స్వీకరించి స్థానికులకు ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో గనిశెట్టి గోవిందరాజులు,వల్లభరెడ్డి సూరిబాబు,నల్లా సత్తిబాబు,నల్లా సందీప్ కొప్పిశెట్టి వీరబాబు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.